# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
VC NEWS
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ సోమవారం 24 నవంబర్ 2025
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 76


PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

**కర్ణాటకలో సీఎం కుర్చీ కోసం ఆగని పోరు**

# గ్లోబల్ సమిట్‌కు
## అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు



### అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

హైదరాబాద్: భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబరు 8, 9 తేదీల్లో రెండు రోజులపాటు జరిగే సదస్సుకు దేశ, విదేశాల నుంచి ప్రముఖులు రానున్నారు. అంతర్జాతీయ స్థాయిలో అత్యున్నత ప్రమాణాలతో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. పుట్టపర్తి నుంచి హెలికాప్టర్‌లో నేరుగా రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట (బేగరికంచ)కు చేరుకున్న సీఎం... సదస్సు నిర్వహించనున్న స్థలానికి రోడ్డు మార్గంలో చేరుకున్నారు. సమిట్ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. అధికారులతో అక్కడే సమీక్షా సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు చేశారు. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో పలు దేశాలకు చెందిన అంబాసిడర్లు, ఉన్నతస్థాయి ప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉంది. సదస్సుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి.ఎంట్రీ పాసులు లేకుండా.. సమిట్‌తో సంబంధం లేని వ్యక్తులు ఎవరూ ప్రాంగణంలోకి రావడానికి వీల్లేదు. శాఖలవారీగా నిర్దేశించిన అధికారులకు ప్రవేశం ఉండాలి. పార్కింగ్‌కు పక్కా ప్రణాళిక రూపొందించాలి. బందోబస్తులో పాల్గొనే పోలీసులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలి' అని అధికారులను ఆదేశించారు. సదస్సు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తానని చెప్పారు. పనుల పురోగతి, ఇతర అంశాలను ఆయనకు అధికారులు వివరించారు. అనంతరం సమీపంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ(ఎఫ్‌సీడీఏ) కార్యాలయం పనుల పురోగతిని సీఎం పరిశీలించారు. ఆయన వెంట ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, మనోహర్‌రెడ్డి, డీజీపీ శివధర్‌రెడ్డి, ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్ అడిషనల్ సీఈవో ఈవీ నరసింహారెడ్డి, ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఉన్నారు. నేడు సీజేఐ ప్రమాణ స్వీకారానికి సీఎం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ సూర్యకాంత్ సోమవారం ప్రమాణ స్వీకారం చేయనుండడంతో.. ఆ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీ వెళ్లనున్నారు. అనంతరం హైదరాబాద్ తిరిగొచ్చి సోమవారం మధ్యాహ్నం కొడంగల్ నియోజకవర్గంలో జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు.




2లో

## భద్రతా మండలి సంస్కరణలు తప్పనిసరి



## టిమ్స్ ఆసుపత్రులు ఎప్పుడు పూర్తి చేస్తారు?: హరీశ్‌రావు

హైదరాబాద్: నెల రోజుల్లో టిమ్స్ సనత్‌నగర్ ఆసుపత్రిని ప్రారంభిస్తామని జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా సీఎం ప్రకటించి నెల దాటినా ఇప్పటికీ అతీగతీ లేదని, టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణాల పట్ల ప్రచార ఆర్భాటాలు తప్ప పురోగతి కనిపించడం లేదని భారత రాష్ట్ర సమితి మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. టిమ్స్ ఆసుపత్రులను ఎప్పుడు ప్రారంభిస్తారని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. "ప్రభుత్వ భూములను అమ్ముకోవడంపై ఉన్న శ్రద్ధ ప్రజలకు వైద్యసేవలు అందించడంపై లేదు. ముఖ్యమంత్రి, మంత్రుల మాటలు కోటలు దాటుతున్నాయే గానీ, ఆచరణ గడప దాడడం లేదనడానికి టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణమే నిదర్శనం. భారత రాష్ట్ర సమితి హయాంలో శరవేగంగా జరిగిన టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణ పనులు.. కాంగ్రెస్ రాగానే నత్తనడకన సాగుతున్నాయి. ఆసుపత్రుల నిర్మాణాలు పూర్తయితే ఎక్కడ కేసీఆర్‌కు పేరొస్తుందో అనే ఆలోచనలతో సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగానే వాటి పనులను పూర్తి చేయడం లేదు" అని హరీశ్‌రావు విమర్శించారు.



## తెలంగాణలో ఏపీకే ఫైల్స్ అలజడి!..
### వందల వాట్సప్ గ్రూపులపై దాడి

హైదరాబాద్: రాష్ట్రంలో ఏపీకే ఫైల్స్ పేరుతో సైబర్ నేరగాళ్లు అలజడి సృష్టిస్తున్నారు. 'ఆధార్‌తోపాటు ఇతర నో యువర్ కస్టమర్ (కేవైసీ) వివరాలు అప్‌డేట్ చేసుకోని కారణంగా ఈరోజు రాత్రి నుంచి మీ బ్యాంకు ఖాతా బ్లాక్ చేస్తున్నాం. వెంటనే కింద ఉన్న లింకును క్లిక్ చేసి వివరాలు అప్‌లోడ్ చేయండి' అని టీం ఎస్బీఐ పేరుతో ఆదివారం అనేక వాట్సప్ గ్రూపుల్లో సందేశాలు హోరెత్తాయి. ఎస్బీఐ ఖాతాలున్న చాలామంది బ్లాక్ అవుతుందన్న భయంతో లింకుపై క్లిక్ చేశారు. ఆ క్షణం నుంచే వారి ఫోన్లు నేరగాళ్ల అధీనంలోకి వెళ్లాయి. ఆ వెంటనే సదరు ఫోన్లో ఉన్న ఇతర వాట్సప్ గ్రూపుల్లోకి ఈ సందేశాన్ని పంపారు. ఇలా గొలుసుకట్టుగా వేలాది ఫోన్లకు వెళ్లాయి. ఇందులో రాష్ట్ర మంత్రిత్వశాఖల అధికారులు, మీడియా ప్రతినిధులతో ఏర్పాటు చేసుకున్న గ్రూపులతోపాటు స్నేహితులు, విద్యార్థుల గ్రూపులు కూడా ఉన్నాయి. ఫోన్లలోని సమాచారం సైబర్ నేరగాళ్లకు చేరడంతో అనేకమంది భయాందోళనకు గురవుతున్నారు. పలువురు స్థానిక పోలీసులతోపాటు 1930కి కూడా ఫిర్యాదు చేస్తున్నారు. తక్షణం చేయాల్సిన చర్యలుపొరపాటుగా ఏపీకే ఫైల్ ఇన్‌స్టాల్ చేసి ఉంటే వెంటనే కొన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలి మొదట ఇంటర్‌నెట్ డేటా ఆఫ్ చేసి, సెట్టింగ్స్‌లోని యాప్స్‌లోకి వెళ్లి సదరు ఏపీకే యాప్‌ని అన్‌ఇన్‌స్టాల్ చేయాలి. యాంటీ వైరస్ యాప్‌తో ఫోన్‌ని ఫుల్‌స్కాన్ చేయాలి. బ్యాంకింగ్ యాప్‌లు, సామాజిక మాధ్యమాల ఎకౌంట్లు, ఈ-మెయిల్ ఎకౌంట్ పాస్‌వర్డులు వెంటనే మార్చాలి. మెసేజ్‌లు, కాల్‌లాగ్, బ్యాంకు లావాదేవీలు, ఈ-మెయిల్ లాగిన్లలో అనుమానాస్పద యాక్టివిటీ ఉందేమో పరిశీలించాలి. ఒకవేళ మాల్‌వేర్ యాప్ అన్‌ఇన్‌స్టాల్ అవ్వకపోతే, ఫోన్‌ని సేఫ్ మోడ్‌లో రీస్టార్ట్ చేసి అన్‌ఇన్‌స్టాల్ చేయాలి.ఫోన్లో ఇంకా అనుమానాస్పద యాక్టివిటీ కనిపిస్తే డేటా బ్యాకప్ తీసుకొని ఫ్యాక్టరీ రీసెట్ చేయడం మంచిది.

ఏదైనా మోసపోయినట్లు గ్రహిస్తే వెంటనే బ్యాంకు ఖాతా స్తంభింపజేయాలి. 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి.



## నిజామాబాద్ నాయకుడు.. "ముఖ్యమంత్రి" కావాలి.
### అప్పుడే జిల్లా అభివృద్ధి.
### ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి హాట్ కామెంట్స్.

నాయకుడు.. "ముఖ్యమంత్రి" కావాలనీ, అప్పుడే జిల్లా అభివృద్ధి అవుతుందనిఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారుడు సుదర్శన్ రెడ్డి సమక్షంలో వారిని ఉద్దేశించి రాకేష్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజక వర్గం, నందిపేట్ లో ఆదివారం అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బీజేపీ కి చెందిన ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మాట్లాడారు.

నిజామాబాద్ జిల్లా నాయకుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరముందన్నారు. నిజామాబాద్ బిడ్డ ముఖ్యమంత్రి అయితే 60 ఏండ్ల సమస్యలు ఆరు నెలాల్లో పరిష్కారం అవుతాయన్నారు. కుప్పం, పులివెందుల, గజ్జివెల్, సిద్దిపేట, కొడంగల్ కాదు నిజామాబాద్ నుంచి ముఖ్యమంత్రి కావాలని బల్లగుద్ది మరి చెప్పడం చర్చనీయ అంశంగా మారింది.



ఆయన బోధనలతో ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది భక్తులు ప్రభావితం సెంట్రల్ ట్రస్టు సేవలు అద్భుతం బాబా శతజయంతి వేడుకల్లో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తెలుగు రాష్ట్రాల సీఎంలు, త్రిపుర గవర్నర్ సహా పలువురి హాజరు

## సత్యసాయి.. స్ఫూర్తిప్రదాత

పుట్టపర్తి:సత్యసాయిబాబా స్వర్ణ రథానికి నమస్కరిస్తున్న తమిళనాడు మంత్రి శేఖర్‌బాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, సీఎం చంద్రబాబు, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, మంత్రి లోకేశ్, మేఘాలయ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సోమన్‌సేన్, సత్యసాయి సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండే, ట్రస్టు సభ్యుడు చక్రవర్తి పరోపకారమే పరమావధిగా తన బోధనలు, ఎన్నో సామాజిక కార్యక్రమాలతో భక్తుల గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించిన సత్యసాయి ప్రపంచానికే స్ఫూర్తిప్రదాత అని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో సత్యసాయి శత జయంతి వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. హిల్‌వ్యూ స్టేడియంలో జరిగిన వేడుకలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి,

ఏపీ ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేశ్, తమిళనాడు మంత్రి శేఖర్‌బాబు, మేఘాలయ, ఉత్తరాఖండ్ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ సోమన్‌సేన్, జస్టిస్ గుహనాథన్ నరేంద్ర, సత్యసాయి సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండే, ట్రస్టు సభ్యులు కె.చక్రవర్తి, ఎస్.నాగానంద్, జస్టిస్ రామసుబ్రహ్మణ్యం తదితరులు హాజరయ్యారు.



3లో

## కాంగ్రెస్ ప్రభుత్వంలో "బీసీలకు పెద్దపీట".



3లో

## బీసీవాలు "ప్రభుత్వ ఆశయం" అమలుకు కృషి చేయాలి.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...



# కర్ణాటకలో సీఎం కుర్చీ కోసం ఆగని పోరు

బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్‌లో అధికార పంపిణీ కోసం మొదలైన పోరు మరిన్ని రోజులు కొనసాగేలా కనిపిస్తోంది. మిగిలిన రెండున్నరేళ్ల నాయకత్వం కోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు పట్టుబట్టగా అధిష్ఠానం జోక్యం అనివార్యమైంది. శుక్రవారమే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బెంగళూరుకు చేరుకున్నారు. శనివారం రాత్రి ముఖ్యమంత్రితో, ఆదివారం పలువురు మంత్రులతో ఆయన చర్చించారు. చివరకు ఈ వ్యవహారంపై స్పష్టత ఇవ్వలేకపోయారు. తన నివాసం వద్దకు వచ్చిన మీడియా ప్రతినిధులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ 'మీకు చెప్పేందుకు నా వద్ద ఏ విషయమూ లేదు. మూడు రోజులుగా నా ఇంటి వద్ద పడిగాపులు పడుతున్న మిమ్మల్ని చూస్తుంటే నాకు బాధ అనిపించింది. పార్టీలోనూ ఇలాంటి పరిణామాలు మంచివి కాదు. ఎలాంటి సమస్యలున్నా అధిష్ఠానం పరిష్కరిస్తుంది' అని చెప్పారు. బెంగళూరులో మూడు రోజులున్నా ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆయన మద్దతుదారులెవరూ మల్లికార్జున ఖర్గేతో భేటీ కాకపోవడం గమనార్హం. అయితే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మద్దతుదారులు, మంత్రులు హెచ్.సి.మహదేవప్ప, కె.వెంకటేశ్, ఈశ్వర ఖండ్రే తదితరులంతా ఖర్గేతో చర్చించారు.

**తెరపైకి దళిత సీఎం?**

గత నాలుగైదు రోజులుగా సిద్ధరామయ్య, శివకుమార్ మధ్యే నాయకత్వ పోరు కనిపించినా.. ఆదివారం అనూహ్యంగా సీనియర్ నేతలు తెరపైకి వచ్చారు. వీరంతా ఎస్సీ సామాజికవర్గానికి చెందినవారు కావడం విశేషం. అనివార్యంగా సిద్ధరామయ్యను సీఎం పదవి నుంచి తప్పించాల్సి వస్తే ఆ అవకాశాన్ని ఈసారి ఎస్సీలకు ఇవ్వాలన్న డిమాండ్ వినిపించింది. ఆదివారం హోంమంత్రి డా.జి.పరమేశ్వర్ తానూ సీఎం రేసులో ఉన్నానని ప్రకటించారు. '2013లో నా నాయకత్వంలోనే ఎన్నికలకు వెళ్లి గెలుపొందాం. కానీ నేను ఆ ఎన్నికల్లో ఓడిపోయాను. గెలిచి ఉంటే ఏమయ్యేదో? కాంగ్రెస్‌లో పీసీసీ అధ్యక్షుడికి (అప్పటికి పీసీసీ అధ్యక్షుడు ఈయనే) సీఎంగా అవకాశమిచ్చే సంప్రదాయం ఉంది. అలాగని అన్నిసార్లూ ఈ అవకాశాలు రావు. ఎన్నికలు అనగానే పార్టీలో అందరి కృషీ ఉంటుంది. ఒక్కరి వల్లే విజయం సాధించడం ఉండదు' అని వ్యాఖ్యానించారు.

తద్వారా తన వల్లే రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిందంటూ డీకే శివకుమార్ నిత్యం చేస్తున్న వాదనను పరమేశ్వర్ తోసిపుచ్చే ప్రయత్నం చేశారు. మరోవైపు మంత్రి మహదేవప్ప కూడా మల్లికార్జున ఖర్గేతో చర్చల సందర్భంగా దళితులకు అవకాశమిచ్చే విషయం గురించే ప్రతిపాదించినట్లు సమాచారం. ఖర్గే, పరమేశ్వర్, మహదేవప్ప.. ముగ్గురూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారు కావడం గమనార్హం. గిరిజన సముదాయానికి చెందిన మంత్రి సతీశ్ జారి?హొళి కూడా ఇదే తరహా డిమాండ్ చేస్తున్నారు. రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీ ఒప్పందం కుదిరితే ఆ అవకాశం అగ్రవర్ణాలకు కాకుండా కాంగ్రెస్‌కు బలమైన ఓటు బ్యాంకుగా ఉన్న అహింద (అల్ప సంఖ్యాక, బీసీ, దళిత)లకు ఇవ్వాలన్న డిమాండ్ తాజాగా తెరపైకి వచ్చింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అహింద నేతగా ఇదే సముదాయాలకు చెందిన వారికి అవకాశం కల్పించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఈ పరిణామం ముఖ్యమంత్రి కావాలన్న శివకుమార్ ఆశలకు గండికొట్టవచ్చన్న మాట వినిపిస్తోంది.

# భద్రతా మండలి సంస్కరణలు తప్పనిసరి

**అవి ఎంతమాత్రం ఐచ్ఛికం కావు**

**ఐబీఎస్ఏ నేతల సమావేశంలో మోదీ స్పష్టీకరణ**

**అందరికీ అందుబాటులో నూతన సాంకేతికతలు..**

**జీ20 సదస్సులో భారత ప్రధాని**



జొహన్నెస్‌బర్గ్: ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో సంస్కరణలు తీసుకురావడం ఇక ఎంతమాత్రం ఐచ్ఛికం (ఆప్షన్) కాదని, అది తప్పనిసరి అని భారత ప్రధాని నరేంద్రమోదీ స్పష్టంచేశారు. కృత్రిమ మేధ సహా అధునాతన సాంకేతికతలు, నవ్యావిష్కరణలు ఆయా దేశాలకే పరిమితం కావడం సబబుకాదని.. అవి ప్రపంచ మానవాళికి అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో ఆదివారం జరిగిన జీ20 దేశాల శిఖరాగ్ర సదస్సులో ఆయన ప్రసంగించారు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసాతో చర్చలు జరిపారు. భారత్‌– బ్రెజిల్‌– దక్షిణాఫ్రికా (ఐబీఎస్ఏ) నేతల శిఖరాగ్ర సదస్సునుద్దేశించి మాట్లాడారు. ఈ మూడింటిలో వివిధ అంశాలను ప్రస్తావించారు. మూడు దేశాల మధ్య భద్రతా సహకారాన్ని బలోపేతం చేయడానికి జాతీయ భద్రతా సలహాదారుల (ఎన్ఎస్ఏ) స్థాయి సమావేశాన్ని వ్యవస్థాగతం చేయాలని చెప్పారు.

**మనది హృదయపూర్వక బంధం**

"ఉగ్రవాదంపై పోరాటంలో సమన్వయంతో ముందుకు సాగాలి. దీనిలో ఎలాంటి ద్వంద్వ ప్రమాణాలకు తావులేదు. మనిషి కేంద్రంగా జరిగే అభివృద్ధిలో సాంకేతికతకు కీలక పాత్ర ఉంది. భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా మధ్య యూపీఐ, కొవిన్ వంటి సాంకేతిక చొరవలను, సైబర్ భద్రతను పంచుకోవడానికి ఏర్పాటు చేయాలి. వాతావరణ మార్పుల్ని తట్టుకుని నిలిచే వ్యవసాయానికి కూడా ఐబీఎస్ఏ సహాయ హస్తం అందించాలి. ఐబీఎస్ఏ అనేది కేవలం మూడు దేశాల కూటమి కాదు.. మూడు ఖండాలను కలుపుతున్న ముఖ్యమైన వేదిక. ప్రజలు కేంద్రంగా నిలిచేలా విశ్వసనీయ, సురక్షిత ఏఐ నిబంధనల రూపకల్పనకు ఈ కూటమి తనవంతు చేయూత అందించగలదు. దక్షిణార్ధగోళ దేశాల గొంతును, ఆకాంక్షల్ని బలోపేతం చేయడానికి మనం హృదయపూర్వకంగా కట్టుబడి ఉన్నాం" అని మోదీ చెప్పారు. ఏఐ దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాలని, డీప్‌ఫేక్, ఉగ్రచర్యలకు దానిని వాడుకోవడాన్ని నిలువరించాలని పిలుపునిచ్చారు. ఏఐని నేటి ఉద్యోగాలుగా కాకుండా రేపటి సామర్థ్యాలుగా చూడాలన్నారు.

**దేశాధినేతలతో చర్చలు**

జపాన్ ప్రధాని సనాయె తకాయిచి, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, కెనడా ప్రధాని మార్క్ కార్నే, జమైకా ప్రధాని ఆండ్రూ హెల్నెస్, నెదర్లాండ్స్ ప్రధాని డిక్ స్కోఫ్‌లతో మోదీ చర్చలు జరిపారు. రక్షణ రంగంలో సహకార విస్తృతి గురించి కార్నేతో చర్చించినట్లు ఆయన 'ఎక్స్' వేదికగా తెలిపారు. భారత్‌కు రావాల్సిందిగా ఆహ్వానించినట్లు చెప్పారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టలీనా జార్జీవాతోనూ ఆయన సమావేశమయ్యారు. ఆదివారం రాత్రి దిల్లీకి బయల్దేరారు.

జొహన్నెస్‌బర్గ్‌లో ఐబీఎస్ఏ నేతల సమావేశం సందర్భంగా దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వాలతో ప్రధాని మోదీ

**పగ్గాలు తీసుకోని అమెరికా**

జీ20 తదుపరి సారథ్య పగ్గాలను అమెరికాకు అప్పగించాల్సి ఉండగా ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ఈ సదస్సులో తాము భాగం పంచుకోవడం లేదని ముందుగానే చెప్పేసి, గైర్హాజరయ్యారు. దీంతో దక్షిణాఫ్రికా 'అంతర్జాతీయ సంబంధాలు–సహకార శాఖ' కార్యాలయానికి సోమవారం లాంఛనంగా ఈ బాధ్యతల్ని అప్పగించనున్నారు.

**ఇంత కష్టమంటే మేం పారిపోయేవాళ్లం!**

భారత్– దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఆహార భద్రత, ఏఐ వంటి రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకోవడంపై మోదీ–రమఫోసా చర్చించారు. అంకుర పరిశ్రమల్లో పెట్టుబడులను సులభతరం చేసేందుకు ఇరువురు అంగీకారానికి వచ్చారు. జీ20 సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు రమఫోసాకు మోదీ అభినందనలు తెలిపారు. సదస్సు నిర్వహణ ఇంత కష్టమని మోదీ చెప్పిఉంటే తాము బహుశా పారిపోయి ఉండేవాళ్లమని రమఫోసా చమత్కరించారు. దాంతో అక్కడున్నవారంతా నవ్వుల్లో మునిగిపోయారు. "జీ20 నిర్వహణ గురించి మీ నుంచి మేమెంతో నేర్చుకున్నాం. గతంలో మీకు అవకాశం వచ్చినప్పుడు (దిల్లీలో) ఎంతో భారీగా చేశారు. మేం చిన్నగా సరిపెట్టాం" అని చెప్పారు. 'చిన్నదే ఎప్పుడూ అందంగా ఉంటుంది' అని మోదీ బదులిచ్చారు.

# కాసులు కురిపించిన స్టాక్ ఇదే.. 10 వేలకు రూ. 6 లక్షల లాభం..



స్టాక్ మార్కెట్లలో దీర్ఘకాలంలో మంచి రిటర్న్స్ ఇచ్చే స్టాక్స్ చాలానే ఉంటాయి. ముఖ్యంగా స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేసే వారు ఆర్థిక నిపుణుల సలహా తీసుకొని పెట్టుబడులు పెడితే మంచి లాభాలు అందుకోవచ్చు. ఇక మల్టీబ్యాగర్ స్టాక్స్ ఇన్వెస్టర్లకు కాసుల పంట పండిస్తాయి. అలాంటి ఒక మల్టీబ్యాగర్ స్టాక్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం. రూ. 10 వేల పెట్టుబడిని రూ. 6 లక్షలుగా మలిచింది. మీరు పెట్టుబడులు చేస్తున్నారా? దీని కోసం స్టాక్ మార్కెట్‌ను ఎంచుకుంటున్నారా? దలాల్ స్ట్రీట్‌లో ఇన్వెస్టర్ల సంపదను ఊహించని రీతిలో పెంచిన ఎన్నో స్టాక్స్ ఉన్నాయి. సరైన సమయంలో సరైన స్టాక్ ఎంచుకొని ఇన్వెస్ట్ చేస్తేనే లాంగ్ టర్మ్‌లో మంచి లాభాలు అందుకోవచ్చు. ఆర్థిక నిపుణుల దగ్గర నుంచి సలహాలు తీసుకొని పెట్టుబడులు పెడితేనే రిస్క్ లేకుండా రిటర్న్స్ పొందే అవకాశం ఉంటుంది. కొన్ని స్టాక్స్ ఇటీవల కొంతకాలంగా పనితీరు బాగాలేకపోయినా లాంగ్ టర్మ్‌లో మాత్రం అద్భుతమైన రిటర్న్స్ ఇచ్చిన షేర్లు ఎన్నో మనం గమనించొచ్చు. అలాంటి ఒక 500 స్టాక్ గురించి చూద్దాం. దీంట్లో చిన్న మొత్తంలో పెట్టుబడి లక్షలుగా మారింది. అదే గ్లాస్‌కోట్ లిమిటెడ్. వివిధ పరిశ్రమల కోసం ఈ కంపెనీ గ్లాస్ లైన్డ్ ఎక్విప్‌మెంట్ సహా ఫిల్టర్లు, డ్రైయర్లు వంటి వాటి తయారీలో నిమగ్నమై ఉంది. గత పదేళ్లలో ఈ స్టాక్ ఏకంగా 6 వేల శాతం రిటర్న్స్ ఇచ్చింది. ఈ క్రమంలో రూ. లక్ష పెట్టుబడిని ఈ షేరు రూ. 60 లక్షలు చేసింది. అదే రూ. 10 వేల పెట్టుబడితో కూడా రూ. 6 లక్షల రిటర్న్స్ రావడం విశేషం అని చెప్పొచ్చు. ఈ షేరు కొంతకాలంగా మాత్రం నెగెటివ్‌లో ట్రేడవుతోంది. మార్కెట్లో ప్రస్తుతం ఈ స్టాక్ ధర రూ. 441.45 వద్ద ఉండగా.. నెల వ్యవధిలో 14 శాతం తగ్గింది. 6 నెలల్లో 25 శాతం పడిపోయింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు చూసినట్లయితే 17 శాతానికిపైగా దిగొచ్చింది. ఏడాది కాలంలో కూడా 15 శాతం పతనమైంది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ. 3.01 వేల కోట్లుగా ఉంది. 52 వారాల గరిష్ఠ ధర రూ. 698.40 కాగా.. కనిష్ఠ ధర రూ. 436.80 వద్ద ఉంది. ఆగ్రోకెమికల్స్, స్పెషాలిటీ కెమికల్స్, డైస్, పిగ్మెంట్స్, ఏపీఐ, ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ వంటి రంగాల్లో ఈ కంపెనీ కస్టమర్లు ఉన్నారు. ఇక షేర్‌హోల్డింగ్ ప్యాటర్న్ ప్రకారం ఎక్స్ఛేంజీల్లో ఉన్న సమాచారం మేరకు ప్రమోటర్ల దగ్గరే అత్యధికంగా 67 శాతం వాటా ఉంది. పబ్లిక్ షేర్ హోల్డర్ల వద్ద మిగతా 33 శాతం వాటా ఉంది. పబ్లిక్ షేర్ హోల్డర్లలో మ్యూచువల్ ఫండ్ల వాటా 3.9 శాతం కాగా.. ఫారెన్ ఇన్వెస్టర్ల వాటా 4 శాతంగా ఉంది. ఇక 2023 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో కంపెనీ రెవెన్యూ 11 శాతం పెరిగి రూ. 239 కోట్లుగా నమోదైంది. ఇక నికర లాభం 12 శాతం ఎగబాకి రూ. 28.7 కోట్లకు చేరింది. ప్రస్తుతానికి ఈ స్టాక్ టార్గెట్ ప్రైస్‌ను బ్రోకరేజీ సంస్థలు పెంచుతున్నాయి.

# స్పెషల్ స్కీమ్ తెచ్చిన బ్యాంక్.. వారికి అత్యధికంగా 9 శాతం వడ్డీ..



**అధిక ద్రవ్యోల్బణం నుంచి తప్పించుకు నేందుకు, ఆర్థిక మాంద్యం దరిచేరకుండా చూసేందుకు రెపో రేటును 4 శాతం నుంచి ఏకంగా 250 బేసిస్ పాయింట్లు పెంచి 6.50 శాతానికి చేర్చింది. దీంతో చాలా బ్యాంకులు కూడా లోన్ వడ్డీ రేట్లు పెంచి ఇదే సమయంలో డిపాజిట్లపైనే అధిక వడ్డీ ఆఫర్ చేశాయి. ఇంకొన్ని బ్యాంకులు కస్టమర్లను ఆకర్షించేందుకు లిమిటెడ్ పీరియడ్ ఆఫర్ కింద అధిక వడ్డీ రేటుతో స్పెషల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాల్ని కూడా ప్రారంభిం చాయి. ఇక ఇప్పుడు ప్రముఖ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఒకటి స్పెషల్ ఎఫ్‌డీ తీసుకొచ్చింది. దీని వివరాలు చూద్దాం. ఇతర బ్యాంకులతో పోల్చి చూస్తే స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు పై ఎక్కువ వడ్డీ ఆఫర్ చేస్తాయి.**

కొంతకాలంగా చాలా బ్యాంకులు కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ ఆఫర్ చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వ బ్యాంకుల కంటే ప్రైవేట్ బ్యాంకులు ఎక్కువ వడ్డీ అందిస్తుంటే.. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు ఇంకా ఎక్కువ వడ్డీనే ఆఫర్ చేస్తుండటం గమనించొచ్చు. ఇప్పుడు ఒక స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ స్పెషల్ డిపాజిట్ తీసుకురాగా.. దీనిపైనే అధిక వడ్డీ వస్తోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2022 మార్చి నుంచి 2023 మే వరకు దాదాపు సంవత్సర కాలంలోనే రెపో రేట్లను భారీగా పెంచుకుంటూ పోయింది. అధిక ద్రవ్యోల్బణం నుంచి తప్పించుకు నేందుకు, ఆర్థిక మాంద్యం దరిచేరకుండా చూసేందుకు రెపో రేటును 4 శాతం నుంచి ఏకంగా 250 బేసిస్ పాయింట్లు పెంచి 6.50 శాతానికి చేర్చింది. దీంతో చాలా బ్యాంకులు కూడా లోన్ వడ్డీ రేట్లు పెంచి ఇదే సమయంలో డిపాజిట్లపైనే అధిక వడ్డీ ఆఫర్ చేశాయి. ఇంకొన్ని బ్యాంకులు కస్టమర్లను ఆకర్షించేందుకు లిమిటెడ్ పీరియడ్ ఆఫర్ కింద అధిక వడ్డీ రేటుతో స్పెషల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాల్ని కూడా ప్రారంభిం చాయి. ఇక ఇప్పుడు ప్రముఖ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఒకటి స్పెషల్ ఎఫ్‌డీ తీసుకొచ్చింది. దీని వివరాలు చూద్దాం. ఇతర బ్యాంకులతో పోల్చి చూస్తే స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు పై ఎక్కువ వడ్డీ ఆఫర్ చేస్తాయి. ఇంకా స్పెషల్ స్కీమ్స్‌పై అంతకుమించి వడ్డీ పొందొచ్చు. మరోవైపు సాధారణ ప్రజలతో పోలిస్తే సీనియర్ సిటిజెన్లకు ఎక్కువ వడ్డీ వస్తుంది. చాలా బ్యాంకుల్లో ఇది వారితో పోలిస్తే 50 బేసిస్ పాయింట్లు ఎక్కువే ఉంటుంది. ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు 15 నెలల కాలపరిమితితో ఒక ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్ అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిపై రెగ్యులర్ సిటిజెన్లకు అత్యధికంగా 8.50 శాతం వడ్డీ అందిస్తుండగా.. అదే సీనియర్ సిటిజెన్లకు అయితే మరో 50 బేసిస్ పాయింట్లు ఎక్కువ చేసి 9 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. ఈ మేరకు బ్యాంక్ తాజాగా అధికారిక ప్రకటనలో వెల్లడించింది. రూ. 2 కోట్ల లోపు డిపాజిట్లపై ఇది వర్తిస్తుంది. స్వల్పకాలంలో డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ ఆశించే వారి కోసం ఈ స్కీమ్ తీసుకొచ్చినట్లు బ్యాంక్ స్పష్టం చేసింది.

రూ. లక్ష డిపాజిట్ చేస్తే..

ఇక 15 నెలల వ్యవధిపై రూ. లక్ష డిపాజిట్ చేస్తే రెగ్యులర్ సిటిజెన్లకు 8.50 శాతం వడ్డీ రేటు ప్రకారం రూ. 10,253 వడ్డీ పొందుతారు. మొతం చేతికి 15 నెలల్లో రూ. 1,10,253 వస్తుంది. ఇదే సీనియర్ సిటిజెన్ల విషయానికి వస్తే.. 9 శాతం వడ్డీ ప్రకారం 15 నెలల్లో రూ. లక్ష డిపాజిట్‌పై రూ.10,853 వడ్డీ అందుతుంది. చేతికి మొత్తం రూ. 1,10,853 వస్తుంది. ప్లాటినా డిపాజిట్‌పై సీనియర్ సిటిజెన్లకు 9.20 శాతం వడ్డీ కింద రూ. 11,093 వడ్డీ వస్తుంది. 15 నెలల్లోనే లక్ష డిపాజిట్‌ను రూ. 1,11,093 చేసింది.

# ఇంటింటికి వెళ్లి ఇందిరమ్మ చీరల పంపిణీ.

## - పర్యవేక్షించిన కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్ నవంబర్ 23**





రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం జిల్లాలో ఊపందుకుంది. కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు మహిళా సమాఖ్య ప్రతినిధులతో కలిసి ఐకేపీ అధికారులు, సిబ్బంది ఆదివారం జిల్లాలోని ఆయా మండలాల్లో ఇంటింటికి తిరుగుతూ మహిళలకు ప్రభుత్వం సమకూర్చిన ఇందిరమ్మ చీరలను అందజేశారు. గ్రామీణ ప్రాంత మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం కలెక్టరేట్లో ప్రభుత్వ సలహాదారుతో కలిసి కలెక్టర్, ఎమ్మెల్యేలు లాంఛనంగా ప్రారంభించిన నేపథ్యంలో, మరుసటి రోజు నుండే అన్ని గ్రామాలలో ఇంటింటికి వెళ్లి అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర పంపిణీ చేయాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సెలవు రోజు అయినప్పటికీ, ఐకేపీ ఏపీఎం లు, సీ.సీలు, వీ.ఓ.ఏ లు ఆయా గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ తెలంగాణ సాంప్రదాయం అయిన సారె రూపంలో మహిళలకు ఇందిరమ్మ చీరలు అందజేశారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి చీరల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ, అధికారులకు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర పంపిణీ చేయాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లు, విమర్శలకు తావు లేకుండా పారదర్శకంగా పంపిణీ చేయాలని అన్నారు. జిల్లాకు ఇప్పటి వరకు 2.57 లక్షల ఇందిరమ్మ చీరలు వచ్చాయని, సోమవారం మరో 50వేల చీరలు పంపిస్తున్నట్లు సమాచారం అందిందని కలెక్టర్ తెలిపారు.

# కాలం గర్భంలోకి మావోయిస్ట్ పార్టీ !

మావోయిస్టుల చరిత్ర ముగిసినట్లుగానే భావించాలి. ఉవ్వెత్తున ఎగిసిన పీపుల్స్‌వార్ ఇప్పుడు గతచరిత్రగా మిగిలిపోయింది. ప్రజలతో సంబంధాలు, ప్రజల సమస్యలపై పోరాటం ఉన్నంత వరకు వారు బలంగా ఉన్నారు. ప్రజల అండదండ ఉన్నంత వరకు ఉద్యమం బలంగా సాగింది. కానీ కేవలం అడవికే పరిమితమై, ప్రజలకు దూరమైన నేపథ్యంలో వారికి అండదండలు కరువయ్యాయి. కొండపల్లి సీతారామయ్య మొదలు, గణపతి వరకు పీపుల్స్‌వార్ ఉండగా బలమైన విప్లవపార్టీగా వెలుగొందింది. అలాగే గ్రామస్థాయిలో ప్రజల మనన్నలు పొందింది. ప్రజల సమస్యలపై నిలదీసేలా ఉద్యమాన్ని నిర్మించింది. రాజకీయ నాయకులు గ్రామాలకు వెళ్లాలంటేనే భయపడేలా చేసింది. భూకమందులు పారిపోయి పట్టణాలకు చేరారు. రైతులకు అండగా నిలిచారు. మొత్తంగా సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకుని రావడం, వారికి మేం అండగా ఉన్నామని చెప్పడం ద్వారా బలమైన విప్లవపార్టీగా నిలిచింది. కానీ ప్రజలతో దూరం అయినందున క్రమంగా పార్టీ బలహీనపడుతూ వచ్చింది. అంతెందుకు మావోయిస్ట్ పార్టీగా మారిన తరవాతనే దాని పతనం ప్రారంభమయ్యింది. గ్రామాల్లో మొదలు పట్టణాల్లో కూడా మావోలు దందాలు మొదలు పెట్టారు. కేవలం దందాలు చేసి బెదరించుకునే బ్యాచ్‌గా మారింది. పట్టణాల్లో మావో అగ్రనేతల విలాసాలు బయట పడ్డాయి. పోలీసులకు దొరికిపోయారు. కొందరు ఎన్‌కౌంటర్ అయ్యారు. ఇలా ఆ పార్టీలో కల్చర్ మారింది. ప్రజల పక్షాన పోరాడాలన్న లక్ష్యం పోయింది. దీనికితోడు ప్రపంచం మారుతోంది. అడవుల్లో ఉండి పోరాడేందుకు ఎవరు కూడా సిద్ధంగా లేరు. ఎవరికి వారు తమ కెరీర్ కోసం చదువులను కొనసాగించారు. ఒకప్పుడు డాక్టర్లు, ఇంజనీర్లు వంటి వారు పీపుల్స్‌వార్‌కు ఆకర్శితులయ్యారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు.

సిద్ధాంతాలకు ఆకర్శితమై పోరాడే వారు లేరు. ప్రజలు ఏదో పనిచేసుకుని బతికేందుకే సిద్ధంగా ఉన్నారు. విదేశీ విద్య అందుబాటులోకి రావడంతో యువత విదేశాల బాట పట్టింది. ఇలా రిక్రూట్‌మెంట్లు ఆగిపోయాయి. ఉన్నవారు అడవులకు పరిమితం అయ్యారు. అలాగే పోలీస్ నిర్బంధం వల్ల పార్టీ విస్తరణ అన్నది లేకుండా పోయింది. మొత్తంగా ఒకప్పుడు పీపుల్స్‌వార్‌గా ఉన్న పార్టీ క్రమేణా ప్రాభవం కోల్పోయి మావోయిస్ట్ పార్టీగా మరింత పతనం అయ్యింది. అగ్రనేతల దూరదృష్టి లోపం, విభేదాలు, లొంగుబాట్లు ఇలా అంతా కలసి నిర్వీర్యం అయ్యింది. దీనికితోడు పోలీస్ నిర్బంధం పెరిగింది. గతంలో కూడా నిర్బంధం ఉన్నా ప్రజలు తమ కడుపులో పెట్టుకుని దాచుకున్నారు. ఇకపోతే నమ్ముకున్న గిరిజనులను ఇన్‌ఫార్మర్ల పేరుతో మట్టుపెట్టారు. కిరాతక హత్యలకు పాల్పడ్డారు. గొడ్డలితో నరికి వేయడం,కాళ్లూ చేతులు నరకడం వంటి కిరాతక చర్యలకు పాల్పడ్డారు. పోలీసులు ఎంతగా హింసకు పాల్పడ్డారో అంతకు మించి అన్నట్లుగా నక్సల్స్ హింససాగింది. వారి పతనావస్థకు ఇవన్నీ కారణాలుగానే చూడాలి. తాజాగా హిడ్మా ఎన్‌కౌంటర్‌తో అగ్రనేతలంతా మట్టికరిచినట్లే. కొందరు లొంగిపోయారు. మరికొందరు నేలకొరిగారు.

# ఇన్వెస్టర్లను నిండా ముంచిన రిలయన్స్, ఎస్‌బీఐ షేర్లు..

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు కిందటి వారం భారీ నష్టాల్ని నమోదు చేసిన సంగతి తెలిసిందే. భారీ కరెక్షన్‌కు గురయ్యాయి. స్మా క్యాప్, మిడ్ క్యాప్ స్టాక్స్ ధరలు భారీగా పెరగడం అనుమానాలకు తావిస్తుందని సెబీ ఛైర్‌పర్సన్ స్వయంగా చెప్పడం సహా ప్రాఫిట్ బుకింగ్ నేపథ్యంలో స్టాక్స్ భారీగా పతనమయ్యాయి. దీంతో ఇన్వెస్టర్లు భారీగా నష్టపోయారు. రిలయన్స్, ఎస్బీఐ, ఎల్ఐసీ వంటివాటి వాటానే దీంట్లో ఎక్కువ. స్టాక్ మార్కెట్లలో చాలా వరకు చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్ల ధరలు ఇటీవలి కాలంలో బుడగల్లా పెరుగుతూ వస్తున్నాయని.. ఇది అసలే సహేతుకంగా అనిపించట్లేదని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఛైర్‌పర్సన్ మాధవి పురి బచ్ కొద్దిరోజుల కింద మాట్లాడారు. దీంతో స్టాక్ మార్కెట్లు గత వారం కరెక్షన్‌కు గురైన సంగతి తెలిసిందే. మరోవైపు అంతకుముందు స్టాక్ మార్కెట్ సూచీలు రికార్డు గరిష్టాలకు చేరిన క్రమంలోనే ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు (ప్రాఫిట్ బుకింగ్) పాల్పడ్డారు. దీంతో పలు హెవీవెయిట్ షేర్లు కిందటి వారం భారీగా పతనమయ్యాయి. ఒక్క వారం వ్యవధిలోనే ఇన్వెస్టర్లకు భారీ నష్టం వాటిల్లింది. మార్కెట్ విలువ పరంగా భారత్‌లోని టాప్ 10 కంపెనీల్లో 5 కంపెనీల మార్కెట్ విలువనే ఏకంగా రూ. 2.23 లక్షల కోట్లు పతనమైంది. వీటిల్లో ఎక్కువగా భారత అపర కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎక్కువగా నష్టపోయింది. ఆ తర్వాత ప్రభుత్వ సంస్థలైన లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉన్నాయి. కిందటి వారం బెంచ్‌మార్క్ ఇండెక్స్ సెన్సెక్స్ 1.99 శాతం లేదా 1475.96 పాయింట్లు పడిపోయింది. టాప్–10 కంపెనీల్లో నష్టపోయిన కంపెనీల జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంకు, ఎల్ఐసీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా హిందుస్థాన్ యూనీలివర్ ఉన్నాయి. ఇదే సమయంలో మార్కెట్లు పతనమైనా.. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, ఐటీసీ లాభపడ్డాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ మాత్రమే అత్యధికంగా వారం వ్యవధిలో రూ. 81,763.35 కోట్ల మార్కెట్ క్యాప్ కోల్పోయింది. అంటే ఇన్వెస్టర్లు దీంట్లో పెట్టుబడులు పెట్టి ఇంత మొత్తం నష్టపోయారన్నమాట. ప్రస్తుతం ఎంక్యాప్ రూ. 19.19 లక్షల కోట్లకు చేరింది.

ఎల్ఐసీ మార్కెట్ విలువ రూ. 63 వేల కోట్లు తగ్గి.. రూ. 5.84 లక్షల కోట్లకు దిగొచ్చింది. ఇక ఎస్‌బీఐ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 50 వేల కోట్లు పతనమై ప్రస్తుతం రూ. 6.53 లక్షల కోట్లకు చేరింది. హిందుస్థాన్ యూనీలివర్ రూ. 21 వేల కోట్లు పడిపోయి రూ. 5.46 లక్షల కోట్లకు వచ్చింది. ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ. 6 వేల కోట్లు తగ్గి రూ. 7.57 కోట్లకు చేరింది. వీటికి భిన్నంగా టీసీఎస్ మార్కెట్ విలువ రూ. 38 వేల కోట్లు పెరిగి రూ. 15.25 లక్షల కోట్లకు ఎంక్యాప్ చేరింది. భారతీ ఎయిర్‌టెల్ ఎం–క్యాప్ రూ. 11 వేల కోట్లు ఎగబాకి రూ. 6.89 లక్షల కోట్లకు చేరింది. ఐటీసీ మార్కెట్ విలువ రూ. 7 వేల కోట్లు పెరిగి రూ. 5.23 లక్షల కోట్లకు చేరింది.

# జీపీవోలు "ప్రభుత్వ ఆశయం" అమలుకు కృషి చేయాలి.






**తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి.**

**"గ్రామపాలన ఆఫీసర్స్ అసోసియేషన్ తెలంగాణ" ఆవిర్భావం.**

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్:**

గ్రామపాలన అధికారులు ప్రజా సమస్యల పరిష్కా రంలో కీలకపాత్ర పోషించాలని, ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చేందుకు కృషి చేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి సూ చించారు. ఆదివారం బషీర్ బాగ్ లో జరిగిన గ్రామపాలన ఆఫీసర్స్ అసోసియేషన్ తెలంగాణ (జీపీవోఏటీజీ) ఆవిర్భావ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. గ్రామీణ రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అయితేనే రైతుల సమస్యలకు క్షేత్రస్థాయిలో పరిష్కారం సాధ్యమవుతుందని, రెవెన్యూ వ్యవస్థను గ్రామ గ్రామాన పునర్నిర్మాణం చేయడం ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. జీపీవోల సమస్యల పరిష్కార బాధ్యతను కొత్త సంఘం తీసు కుంటుందని తెలిపారు. సంఘ నాయకత్వం బలంగా ఉంటేనే ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని, ఐక్యతే శక్తి అని లచ్చిరెడ్డి స్పష్టం చేశారు. కారుణ్య నియా మకాలు, వీఆర్వోల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జీపీవోలు ఎటువంటి ప్రలోభాలకు లోను కాకూడదని, ప్రజ లకు నాణ్యమైన సేవలను అందించాలన్నారు.

**జీపీవోల రాష్ట్ర కమిటీ ఎన్నిక.**

జేఏసీ కో–చైర్మన్ కె.రామకృష్ణ, ఇతర ఉద్యోగ సంఘాల నాయకులు రాములు, పాక రమేష్, వి. భిక్షం, మల్లేష్ సమక్షంలో లచ్చిరెడ్డి కొత్త రాష్ట్ర కమిటీని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా గరికే ఉపేందర్రావు, మహిళా అధ్యక్షురాలిగా కంది శిరీషరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా అర్జున్ మల్లారం, ఆర్. విజయ్ కుమార్, కోశాధికారిగా ఇంజమూరి ఈశ్వర్, సెక్రెటరీ జనరల్ గా వి. లక్ష్మీ నర్సింహులు, దాసరి వీరన్న, అసోసియేట్ అధ్యక్షులుగా ఏవి జ్యోతిరెడ్డి, కారుమూరి చంద్రయ్య, ముధుం చిరం జీవి, ఉపాధ్యక్షులుగా బచ్చలకూర పరమేష్, ప్రతిభ, ఎం. చంద్రశేఖర్ గౌడ్, లచ్చిమల్ల నర్సింహారావు, లక్ష్మీనారా యణ, రాచకొండ నాగలక్ష్మి, కార్యదర్శులుగా కోనబోయి న ప్రసాద్, బొల్ల శ్రీనివాస్, బండి శ్రీనివాస్, సునీత, నీరు డు మల్లీశ్వరి, కోటేశ్వరరావును ఎన్నుకున్నారు.



వేగుచుక్క న్యూస్, నిజామాబాద్: మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన ధర్మపురి సంజయ్ కు శుభాకాంక్షలు తెలిపి, సన్మానించిన మున్నూరు కాపు జర్నలిస్టులు.

# రిటైర్డ్ ఉద్యోగులు "సమాజానికి ఆదర్శం".

**- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ.**

**నిజామాబాద్:వేగుచుక్క న్యూస్,**








రిటైర్డ్ ఉద్యోగులు "సమాజానికి ఆదర్శం" అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ అన్నారు.తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా 3వ మహాసభలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలకు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ప్రభుత్వ సేవలో కీలక పాత్ర పోషించి రిటైర్ అయిన ఉద్యోగులు సమాజానికి అమూల్యమైన అనుభవం, విజ్ఞానం, శిక్షణ కలిగిన వనరులని పేర్కొన్నారు. ప్రభుత్వం నడిచే ప్రతి శాఖలోనూ తమ సేవతో ప్రజల జీవితాలను సానుకూలంగా మార్చినవారే పెన్షనర్లు అని అభివర్ణించారు.ప్రస్తుతం రిటైర్డ్ ఉద్యోగులు నేరుగా కార్యాలయాల్లో పనిచేయకపోయినా, సేవ మనసు మాత్రం ఎప్పటికీ ఆగకూడదన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, విద్యా సహాయం, సేవా కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలన్నారు. తమ అనుభవం, సాయం, మార్గదర్శనం సమాజానికి చాలా అవసరం అని పేర్కొన్నారు. పెన్షనర్ల సమస్యలు, ఆరోగ్య భద్రత, పింఛన్ సంబంధిత అంశాలు, ప్రభుత్వానికి వివరించి పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. మహాసభలకు అసోసియేషన్ ప్రతినిధులు రామ్మోహన్, ఈవిఎల్ నారాయణ తో పాటు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో "బీసీలకు పెద్దపీట".

**కలిసికట్టుగా బీసీలు ఉంటే రాష్ట్రంలో తిరుగులేని శక్తి.**

**"మున్నూరు కాపు" లకు తగిన ప్రాధాన్యం.**

**ధర్మపురి శ్రీనివాస్ తన రాజకీయ గురువు.**

**పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడి.**

**ఘనంగా మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా డి. సంజయ్ ప్రమాణ స్వీకారం.**

**పాల్గొన్న ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, కాంగ్రెస్ నాయకులు.**






**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

కాంగ్రెస్ ప్రభుత్వంలో "బీసీలకు పెద్దపీట" వేస్తున్నామని, కలిసికట్టుగా బీసీలు ఉంటే రాష్ట్రంలో తిరుగులేని రాజకీయ శక్తిగా ఎదుగుతారని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.ఆదివారం నగరంలో నిజామా బాద్ మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా ధర్మపురి సంజయ్, కార్యవర్గం ఘనంగా ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యి, మాట్లాడారు. ధర్మపురి శ్రీనివాస్ తన రాజకీయ గురువని. ఆయన చూపిన మార్గదర్శకత్వమే తన రాజకీయ ప్రయాణానికి బలమని చెప్పారు. డీఎస్ ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ ఎప్పటికప్పుడు బీసీలకు ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు.రాష్ట్రవ్యాప్తంగా డీసీసీ అధ్యక్షుల నియామకంలో 17 పదవులను బీసీలకు కేటాయించడం, మొత్తం పార్టీ కమిటీల్లో 75 శాతం బాధ్యతలను బీసీ, ఎస్సీ, ఎస్టి వర్గాలకు ఇవ్వడం ద్వారా సామాజిక న్యాయం సాధించేందుకు కాంగ్రెస్ ముందంజ వేసిందని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ నిర్ణయం దేశ రాజకీయ చరిత్రలో నిలిచిపోయే సంస్కరణగా పేర్కొన్నారు. బీసీ కులాల మధ్య ఐక్యత అత్యవసరమని మహేష్ గౌడ్ పిలుపునిచ్చారు. అప్పుడు మాత్రమే తమ సామాజిక, రాజకీయ బలం పెరుగుతుందని వ్యాఖ్యానించారు.

మున్నూరు కాపు సామాజిక వర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ నిబద్ధతతో పనిచేస్తోందని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలు మరియు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో మున్నూరు కాపులకు తగిన ప్రాధాన్యం లభించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి సంజయ్ నిజామాబాద్ మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. కొత్తగా నియమితమైన కార్యవర్గ సభ్యులు కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, కాంగ్రెస్ నాయకులు, సంఘ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# రైలుఢీ కొని 90 గొర్రెలు మృతి.

**వాగులో దూకిన కాపరి సైతం మృత్యువాత.**

**కామారెడ్డి శివారులో ఘటన.**





**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి:**

గొర్రెలను మేతకు తీసుకుపోయిన కాపారులు, రైలు పట్టాలు దాటిస్తుండగా ఎక్స్ ప్రెస్ రైలు వచ్చి గొర్రెల మందను ఢీ కొనడంతో సుమారు 90 గొర్రెలు వరకు మృత్యువాత పడ్డాయి. కాగా గొర్రెలు మేపుతున్న వాటి యజమాని రైలు వస్తున్న విషయాన్ని గమనించి ఆకస్మాత్తుగా పక్కనే గల వాగులో దూకేయగా, అతను సైతం మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం కామారెడ్డి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి కి చెందిన దర్శపు సుధాకర్ (35) అనే వ్యక్తి మరో వ్యక్తితో కలిసి గొర్రెలు మేపడానికి కామారెడ్డి శివారులోని ఫైర్ స్టేషన్ సమీపంలో గల రైల్వే బ్రిడ్జి వద్ద మేపుతున్నారు. రైలు వచ్చే విషయాన్ని పసిగట్టకుండానే గొర్రెలను పట్టాలను దాటిస్తుండగా ఒక్కసారిగా రైలు వచ్చి గొర్రెల మందను ఢీకొంది. దీంతో పక్కనే ఉన్న సుధాకర్ రైలు తనను కూడా ఢీకొంటుందేమోనని భయపడి పట్టాల పక్కనే గల వాగులో ఆకస్మాత్తుగా దూకేశాడు. అయితే సుధాకర్ వాగులో పడిపోవడంతో అతని ఆచూకీ కోసం గజ ఈతగాళ్లతో గాలించగా సాయంత్రం శవం లభ్యమైంది. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అంధులకు శిక్షణ ఇస్తే అన్నిట్లో రాణిస్తారు.







**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్:**

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ.**

**స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్స్ట్రక్షన్ అందుల వసతి గృహం ఘనంగా ప్రారంభోత్సవం.**

అంధులకు సరైన శిక్షణ అందిస్తే అన్నిట్లోనూ రాణిస్తారని, వారిని ఎట్టి పరిస్థితుల్లో చులకన భావంతో చూడొద్దని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ పేర్కొన్నారు. ఆదివారం నగర శివారులోని ముబారక్ నగర్ పరిధిలోని తారకరామా నగర్ కాలనీలో స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో అంధ విద్యార్థుల కోసం నూతనంగా నిర్మించిన వసతి గృహాన్ని అర్బన్ ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి, సొసైటీ కార్యదర్శి సిద్దయ్యలు నూతన హాస్టల్ వసతి గృహప్రవేశం సందర్భంగా యజ్ఞ, హెూమ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ, మానసిక, దివ్యంగా, అంద విద్యార్థులకు ప్రత్యేక విద్యను అందిస్తూ వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీస్తున్న సిద్దయ్య వారి సిబ్బందికి అభినందనలు తెలిపారు. మానసిక దివ్యాంగ విద్యార్థులను ఎవరు కూడా హేళన చేయకూడదని, కుదిరితే వారికి ప్రేమను పంచాలని అన్నారు. ఎమ్మెల్యేగా తన వంతు మానసిక దివ్యంగా విద్యార్థులకు స్నేహ సొసైటీ లో చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక నిధులు తీసుకురావడమే కాకుండా, తమ సొంత ట్రస్టు ద్వారా ఏదైనా సాయం కోరితే తప్పకుండా నెరవేరుస్తాననీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ముక్క దేవేందర్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.

**- పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్సీ ఎమ్మెల్యే, కలెక్టర్.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, నవంబర్ 23**



ఆర్మూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఆదివారం జిల్లా పాలనాధికారి టి.వినయ్ కృష్ణారెడ్డితో కలిసి ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, శాసన మండలి సభ్యులు బి.మహేష్ కుమార్ గౌడ్, ఆర్మూర్ శాసన సభ్యులు పైడి రాకేష్ రెడ్డి తదితరులు అభివృద్ధి పనులకు భూమి పూజలు చేశారు. ఆంధ్రనగర్ నుండి ఇందిరానగర్ మీదుగా లక్నపూర్ వరకు రూ. 2.28 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీ.టీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా నందిపేట్ శివారులో జన్నేపల్లి మెయిన్ రోడ్డు నుండి లక్కంపల్లి,చింరాజ్ పల్లి మీదుగా తల్వేద వరకు రూ.6.93 కోట్లతో చేపట్టనున్న ఆర్ అండ్ బీ రోడ్డు విస్తరణ పనులకు, ఐలాపూర్ గ్రామంలో రూ. 2.45 కోట్లతో నూతనంగా నిర్మించనున్న ఎస్సీ బాలుర హాస్టల్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రతీ చోట ప్రజాప్రతినిధులను, కలెక్టర్ ను ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాలలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో "పరుగుపందెం" పోటీలు.

**- ప్రథమ స్థానంలో నిలిచిన గెరిగంటి లక్ష్మీ నారాయణ.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి:**




జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఆదివారం పరుగుపందెం పోటీలు నిర్వహించారు. కామారెడ్డి జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 10 కిలోమీటర్ల పరుగు పందెంలో 45o50 వయసు కేటగిరీలో గెరిగంటి లక్ష్మినారాయణ ( కామారెడ్డి అర్బన్ ) 10 కిలోమీటర్ల దూరాన్ని 46 నిమిషాల్లో పూర్తి చేసి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. అలాగే 10 కిలోమీటర్ల దూరాన్ని 48 నిమిషాల్లో కంప్లీట్ చేసి 45o50 వయసు కేటగిరిలో 2వ స్థానంలో దండబోయిన నరేందర్ ( రామారెడ్డి ) రిటైర్డ్ ఆర్మీఉద్యోగి మోడల్ సాదించారు. 10 కిలోమీటర్ల కేటగిరిలో 10 కిలోమీటర్ల దూరాన్ని 48 నిమిషాల్లో పూర్తి చేసి 35o40 వయసు కేటగిరీల్లో దర్మగోని రంజీత్ గౌడ్ ( చిన్న మల్లారెడ్డి ) కానిస్టేబుల్ ఉద్యోగి ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మోడల్ సాదించారు.

# 'సరిహద్దులు మారొచ్చు.. సింధ్ మళ్లీ భారత్‌లో కలవొచ్చు!'..

పాకిస్థాన్‌లోని 'సింధ్' ప్రాంతం విషయంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాంతం నేడు భారత్‌లో భాగం కాకపోయినా.. ఇక్కడి నాగరిక వారసత్వంతో ఇప్పటికీ ముడిపడి ఉందన్నారు. సరిహద్దులు మారొచ్చని, 1947లో దేశ విభజన అనంతరం పాక్‌లో భాగమైన సింధ్.. భవిష్యత్తులో తిరిగి భారత్‌లో కలవొచ్చని వ్యాఖ్యానించారు. దిల్లీలో సింధీ సమాజం కార్యక్రమంలో ఆయన ఈమేరకు ప్రసంగించారు."సింధీ హిందువులు.. ముఖ్యంగా తన తరం వారు సింధ్‌ను భారత్ నుంచి వేరుచేయడాన్ని ఇప్పటికీ అంగీకరించలేదని భాజపా అగ్రనేత ఎల్‌కే ఆద్వానీ తన ఓ పుస్తకంలో రాశారు. కేవలం సింధ్‌లోనే కాదు.. భారత్‌వ్యాప్తంగా హిందువులు సింధు నదిని పవిత్రంగా భావించేవారు. నేడు ఆ ప్రాంతం భారత్ భాగం కాకపోవచ్చు. కానీ.. నాగరికత ప్రకారం ఎల్లప్పుడూ మన దేశంలో భాగంగా ఉంటుంది. ఇక భూమి విషయానికొస్తే.. సరిహద్దులు మారొచ్చు. ఎవరికి తెలుసు.. భవిష్యత్తులో సింధ్ మళ్లీ మన దేశంలో కలవొచ్చు.

వేగుచుక్క

# సినిమాలో ఎఐ ట్రెండ్



మహ్మదన్ రఫీతో సోనూ నిగమ్ పాట కృత్రిమ మేధ ఏఐ సంగీత రంగంలోనూ సరికొత్త ట్రెండ్‌ను క్రియేట్ చేస్తోంది. ఏఐతో ఇప్పటి వరకూ దివంగత గాయకుల గొంతులను సినిమాల్లో వినిపించారు సంగీత దర్శకులు. ఇప్పుడీ ట్రెండ్‌ను గాయకుడు సోనూ నిగమ్ లైవ్ కాన్సర్ట్‌లోకి తెచ్చారు. లైవ్‌లో ఏఐ వినియోగించి దివంగత గాయకుడు మహమ్మద్ రఫీతో కలిసి డ్యుయెట్ పాడి ఔరా అనిపించారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో సోనూ నిగమ్ కాన్సర్ట్ ఏర్పాటు చేశారు. అందులో రఫీకి సోనూ నిగమ్ అద్భుతమైన నివాళులర్పించారు. ఏఐ టెక్నాలజీని ఉపయోగించి రఫీతో గొంతుకలిపారు. స్క్రీన్‌పై రఫీ వీడియో, ఆయన గొంతు వినిపించడంతో అభిమానులు భావోద్వేగానికి గురయ్యారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ఇది మరపురాని అనుభూతి' అని అభిమానులు పేర్కొనగా, 'ఏఐని సరిగ్గా ఉపయోగించారు.

ఇది కొత్త ట్రెండ్' అంటూ పలువురు ప్రశంసలు కురిపించారు. 1924 డిసెంబరు 24న జన్మించిన ఆయన ఎన్నో భాషల్లో వేల పాటలు పాడి రికార్డులు సృష్టించారు. ఆయన బయోపిక్ తీసేందుకు బాలీవుడ్‌లో సన్నాహాలు జరుగుతున్నాయి. ఇక సోనూ నిగమ్ హిందీతో పాటు దక్షిణాది చిత్రాల్లోనూ సూపర్ హిట్ సాంగ్స్‌తో అలరిస్తున్నారు.

# వారణాసిలో మ్యూజిక్ అదుర్స్

## ఆరు పాటలుంటాయని హింట్ ఇచ్చిన కీరవాణి






ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ట్రెండింగ్‌లో ఉన్న సినిమా 'వారణాసి'. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా తెరకెక్కుతోన్న ఈ యాక్షన్ అడ్వెంచర్ మూవీకి సంబంధించిన ప్రతి వార్త క్షణాల్లో వైరల్ అవుతోంది. ప్రజలు కూడా ఈ మూవీపై క్యూరియసిటీతో ఉన్నారు. తాజాగా చిత్ర సంగీత దర్శకుడు కీరవాణి ఈ సినిమాపై మ్యూజికల్ అప్‌డేట్ ఇచ్చారు. గోవా వేదికగా జరుగుతోన్న ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి) వేడుకలకు హాజరైన కీరవాణి.. 'వారణాసి'లో సంగీతం ఎవరూ ఊహించని స్థాయిలో ఉంటుందన్నారు. 'అభిమానులు ఈ చిత్రంలో అద్భుతమైన సంగీతాన్ని వింటారు. అంతకు మించి ఇప్పుడే ఈ ప్రాజెక్ట్ గురించి ఏం చెప్పలేను. 'వారణాసి'లో మొత్తం ఆరు పాటలు ఉంటాయి. మనం చేసే పని ఏదైనా కానీ.. దానిపై మనకు స్పష్టత, మనపై మనకు నమ్మకం ఉంటే ఏవిషయమూ గందరగోళంగా అనిపించదు. ఒత్తిడిగా కూడా ఉండదు. నాకు ఈ ప్రాజెక్ట్ విషయంలో ఎటువంటి గందరగోళం లేదని చెప్పారు. ఇప్పటికే ఈ సినిమాలో 'రణ కుంభ' ఆడియో సాంగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ యూట్యూబ్‌లో ట్రెండ్ సృష్టిస్తోంది. రాజమౌళి తెరకెక్కించే సినిమాలకు ఆయన సోదరుడు కీరవాణి సంగీతం అందిస్తారు. గతంలో వీరిద్దరి కాంబోలో వచ్చిన 'స్టూడెంట్ నెం.1', 'యమదొంగ', 'మగధీర', 'ఈగ', 'బాహుబలి'లోని పాటలు నేటికీ సోషల్‌మీడియా రీల్స్‌లో వైరల్ అవుతూనే ఉన్నాయి.

ఇక వీరి కాంబోలో వచ్చిన 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాటను ఆస్కార్ వరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 'వారణాసి'కి సంబంధించిన ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో పలు భాషలకు చెందిన అగ్రతారలు నటిస్తున్న నేపథ్యంలో దీని బ్జడెట్‌పై వార్తలు వెలువడుతున్నాయి. వీరికి భారీ పారితోషికం ఇవ్వనున్నారని టాక్ వినిపిస్తోంది. ఇక ఈ చిత్రబ్జడెట్ ఏకంగా రూ.1100 కోట్లని ప్రచారం జరుగుతోంది. 2027 వేసవిలో ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



# మహిళలు బలహీనులు కాదు..బలవంతులు

**నటి రష్మిక మందన్నా కామెంట్స్**

ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో దూసుకెళ్తున్న హీరోయిన్ రష్మిక మందన్నా, భాష ఏదైనా పట్టించుకోకుండా వరుస సినిమా ప్రాజెక్టులతో బిజీగా గడుపుతోంది. అదే వేగంతో విజయాలు కూడా అందిపుచ్చుకుంటూ స్టార్ హీరో రేంజ్ ఫ్యాన్‌బేస్‌ను సంపాదించుకుంది. తాజాగా విడుదలైన 'గర్ల్‌ఫ్రెండ్' సినిమాతో మరో హిట్ తన ఖాతాలో వేసుకున్న రష్మిక, సినిమాలకే కాకుండా సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉండి అభిమానులతో కంటిన్యూ టచ్‌లో ఉంటుంది. ఇటీవల ఆమె స్త్రీశక్తి గురించి ఓ ఆసక్తికరమైన పోస్ట్‌ను షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించింది.

అమ్మాయిలంతా ఏకమై నిలిస్తే ఆ శక్తిని ఎవరూ ఆపలేరని ఆమె స్పష్టంగా తెలిపింది. మహిళల మధ్య ఉండే భావోద్వేగ అనుబంధం వేరే స్థాయిలో ఉంటుందని, మంచి స్నేహితురాలితో దగ్గరైతే జరగబోయే విషయాలు ముందే అర్థమైపోతాయనే ఫీలింగ్ కలుగుతుందని చెప్పింది. స్త్రీలు ఒకరికొకరు మద్దతు ఇస్తే జీవితం మరింత సులభమవుతుందని, వారు బలహీనులు కాదు, ఎంతో ప్రేమతో, బలంతో ఉండే వ్యక్తులని రష్మిక పేర్కొంది. ఎల్లప్పుడూ తనతో ఉండే స్నేహితురాళ్లకు కృతజ్ఞతలు చెబుతూ, ప్రతి ఒక్కరి జీవితంలో కూడా ఇలాంటి మంచి ఫ్రెండ్స్ ఉండాలని కోరుకుంటు న్నానని ఆమె చెప్పింది.




# ప్రభాస్ ఫౌజీపై ప్రీక్వెల్

## ఊహాగానాలు...

ఇప్పటి వరకు రెబల్ స్టార్ 'ప్రభాస్' సీక్వెల్ మూవీస్ మాత్రమే చేశారు. రెండు భాగాలుగా వచ్చిన 'బాహుబలి' భారీ విజయాన్ని సాధించగా.. నెక్ట్స్ కల్కి 2, సలార్ 2 రెడీ అవుతున్నాయి. ఈ లిస్ట్‌లో రాజాసాబ్ కూడా ఉంది. అయితే ఇవన్నీ సీక్వెల్స్ మాత్రమే. ఇప్పుడు ఓ సినిమాకు ప్రీక్వెల్ ప్రయత్నాలు జరుగుతున్నట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తున్న సినిమాల్లో 'ఫౌజీ' కూడా ఒకటి. సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాకు హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే ఏడాది ఆగష్టులో ఈ సినిమా రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నారు. ఇమాన్వీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ వారు భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. అయితే ఫౌజీ చిత్రానికి ప్రీక్వెల్ చేసే ప్లానింగ్‌లో ఉన్నారట రాఘవపూడి. ఇప్పటి వరకు వచ్చిన ఫౌజీ అవుట్ పుట్ పట్ల ప్రభాస్ చాలా హ్యాపీగా ఉన్నారట. హను వర్క్‌కు ఫిదా అవుతున్నాడట డార్లింగ్. అందుకే ఆయనతో మరో సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా ఓ టాక్ ఉంది. ఇప్పుడు దాదాపుగా ప్రీక్వెల్ ఫిక్స్ అయినట్టేనని తెలుస్తోంది. అయితే ఫౌజీ రిజల్ట్‌ను బట్టి ఈ ప్రాజెక్ట్ ఉంటుందా?, ఉండదా? అనేది డిసైడ్ కానుంది. పౌజీ హిట్ అయితే ప్రీక్వెల్ ఉండే ఛాన్స్ ఉంది, లేదంటే లేదు. ఏదేమైనా ఫౌజీ మాత్రం మామూలుగా ఉండదనేది ఇండస్ట్రీ ఇన్‌సైడ్ టాక్. ఇందులో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారు. యుద్ధంలో పుట్టిన ప్రేమకథగా ఈ సినిమా ఉంటుందని ముందు నుంచి ప్రచారంలో ఉంది.




# ఆస్కార్ ఎంట్రీ పొందిన హోమ్‌బౌండ్

ఆస్కార్ 2026' కు భారత్ తరఫున అధికారిక ఎంట్రీ పొందిన చిత్రం 'హోమ్‌బౌండ్'. 'ది బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్' విభాగంలో సెలెక్ట్ అయిన ఈ సినిమాలో ఇషాన్ ఖట్టర్ , విశాల్ జెత్వా, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రధారులు. సెప్టెంబరులో థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ప్రస్తుతం ఓటీటీ 'నెట్‌ఫ్లిక్స్' లో స్ట్రీమింగ్ అవుతోంది. 23 చిత్రాలను వెనక్కినెట్టి అకాడమీ అవార్డుకు ఎంట్రీ పొందిన 'హోమ్‌బౌండ్'లో ఏముందన్నది చర్చిస్తున్నారు. అది ఉత్తరాదిలోని ఓ గ్రామం. చందన్ కుమార్ (విశాల్ జెత్వా), మహ్మద్ షోయబ్ (ఇషాన్ ఖట్టర్) మంచి స్నేహితులు. వేర్వేరు సామాజిక వర్గాలు, మతాలకు చెందిన వారు సమాజంలో అవమానాలకు గురవుతుంటారు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించి, తమకంటూ గుర్తింపు పొందేందుకు ప్రయత్నాలు మొదలుపెడతారు. పోలీసు కావడమే ఇద్దరి లక్ష్యం. అలా కానిస్టేబుల్ పరీక్ష రాసినా.. ఫలితాల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో షోయబ్ ఓ కంపెనీలో ఆఫీస్ బాయ్‌గా చేరతాడు. చందన్ డిగ్రీ చదివేందుకు.. తాను ఇష్టపడిన సుధా భారతి (జాన్వీ కపూర్) చదివే కాలేజీలో జాయిన్ అవుతాడు. ఆ తర్వాత ఊహించని రీతిలో చందన్, షోయబ్ మధ్య మనస్పర్థలొస్తాయి. దానికి కారణమేంటన్నదే కథ. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన సినిమా ఇది. స్నేహం, వివక్ష, ప్రభుత్వ ఉద్యోగానికి ఉండే పోటీ, కొవిడ్ కష్టాలు.. ఇలా పలు పార్శ్వాలతో కూడిన ఈ కథను ఎవరే కోణంలో చూస్తే అదే ప్రధానాంశంగా అనిపిస్తుంది. నెమ్మదిగా సాగినా ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతుంది. స్నేహితులైన చందన్, షోయబ్‌ల లక్ష్యమేంటన్నది ప్రారంభంలోనే అర్థమవుతుంది. ప్రభుత్వ ఉద్యోగానికి ఉండే తీవ్ర పోటీ, పరీక్ష రాసినా ఫలితం తేలకపోతే అభ్యర్థులు పడే మనోవేదన, ఒకవేళ పరీక్షలన్నింటిలో పాస్ అయినా పోస్టింగ్ ఆలస్యం కావడం, చివరకు సర్కారు కొలువుపై ఆశలు వదులుకుని ఏదో ఒక పనిలో చేరడం.. ఇలా మన చుట్టూ జరిగిన, జరుగుతున్న వాటిని కళ్లకు కడుతూ కథలోకి లీనమయ్యేలా చేశారు దర్శకుడు. చందన్ పాత్ర కోణంలో కుల వివక్ష, షోయబ్ పాత్ర వైపు నుంచి మతపరమైన ఇబ్బందులే ప్రధానాంశాలు. స్నేహితుల మధ్య గొడవ జరిగినప్పటి నుంచి స్టోరీ ఎమోషనల్‌గా సాగుతుంది.

# మోహన రాగ మ్యూజిక్ లాంచ్ చేసిన మంచుమనోజ్



టాలీవుడ్ నటుడు మంచు మనోజ్ తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ఆరంభించారు. ఈసారి సినీ సెట్‌లో కాదు? సంగీత ప్రపంచంలోకి అడుగుపెట్టారు. ఆయన కొత్త మ్యూజిక్ లేబుల్ 'మోహన రాగ మ్యూజిక్' శనివారం అధికారికంగా లాంచ్ అయింది. చాలా ఏళ్లుగా తన మనసులో దాగి ఉన్న ఈ కల నేడు నెరవేరిందని మనోజ్ భావోద్వేగంగా వెల్లడించారు. ట్విటర్‌లో 'మోహన రాగ మ్యూజిక్' పేరుతో ఓ సరికొత్త సంగీత సంస్థను ప్రారంభించబోతున్నట్టు చెప్పుకొచ్చారు మంచు మనోజ్. మ్యూజిక్ అంటే తనకు ఎంతో ఇష్టమని? ఈ సంస్థ ద్వారా న్యూ యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహించనున్నట్లు చెప్పుకొచ్చాడు. 'లోకల్ హార్ట్స్, గ్లోబల్ బీట్' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. సంగీతం ఎల్లప్పుడూ నా ఎస్కేప్. నా ఎక్స్‌ప్రెషన్, నా నిజం. ఈ రోజు ఆ జర్నీ డెవలప్ అవుతోంది. నా కొత్త ప్రపంచ మ్యూజిక్ వెంచర్ ఇంట్రడ్యూస్ చేస్తున్నాను. మోహన రాగ మ్యూజిక్? యంగ్ టాలెంట్, కరేజ్, నిర్భయమైన సృజనాత్మక కోసం నిర్మించాం అని మంచు మనోజ్ స్పష్టం చేశాడు. నటుడిగా ఎన్నో సినిమాల్లో తనకంటూ ప్రత్యేకమైన మార్క్ సంపాదించిన మనోజ్, సంగీతంపై కూడా మంచి పట్టు ఉన్న సంగతి చాలా మందికి తెలియదు. పోటుగాడు సినిమాలో 'ప్యార్ మే పడిపోయా' పాటను స్వయంగా పాడారు. కరోనా సమయంలో విడుదల చేసిన 'అంతా బాగుంటాండ్రా' పాటకు విపరీతమైన స్పందన వచ్చింది అంతేకాదు పిస్తా పిస్తా, ఎన్నో ఎన్నో, ప్రాణం పోయే బాధ వంటి పాటలకు లిరిక్స్ కూడా రాశారు. అతని స్వరంలో ఉండే సహజమైన ఎమోషన్,

సంగీతాన్ని వ్యక్తీకరించే తీరు ప్రత్యేకమని ఆయన అభిమానులు అప్పుడప్పుడూ

చెబుతుంటారు. మనోజ్ తండ్రి డాక్టర్ మంచు మోహన్ బాబు, అన్న మంచు విష్ణు, అక్క లక్ష్మి మంచు సినిమాలకు సంగీతం,

యాక్షన్ విభాగాల్లో కూడా పనిచేసిన విషయాన్ని మనోజ్ గుర్తుచేశారు. మోహన రాగ అనే పేరుకు తనకూ, తన కుటుంబానికీ ప్రత్యేకమైన అనుబంధం ఉందని తెలిపారు.